క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ



పెద్దాపురంలో వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు సోమవారం పెద్దాపురంలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.గోవర్ధన్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టణంలో పందుల పెంపకం నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరాజు

తుని: ప్రజారోగ్యం దృష్ట్యా పట్టణంలో పందుల పెంపకం చేయవద్దని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో పందుల పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పట్టణంలో పందులు పెంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాఆరోగ్యశాఖ అధికారి శేఖర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



శృంగరాయునిపాలెంలో పంట నమోదు చేస్తున్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. మండలంలోని శృంగరాయునిపాలెం, యస్.ఆర్.పేట, పాలెం, యస్.తిమ్మాపురం గ్రామాల్లో పంట నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది రబీలో మండలంలో 2 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు. రైతులందరూ పాస్‌బుక్, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో రైతుల భరోసా కేంద్రాలకు వెళ్లి పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. వీఏఏ వందన, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా భోగిపళ్ల ఉత్సవం



జగ్గంపేట రాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి పసుపు కొట్టిన మహిళలు

జగ్గంపేట: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి అమ్మవారికి భోగిపళ్ల వేసే ఉత్సవం కన్నులపండువగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భోగిరోజు జరిగే గోదాదేవి కల్యాణానికి పసుపు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పసుపు దంచారు.

సంక్రాంతి సంబరాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

శంఖవరం: ప్రత్తిపాడు మండలం ఏలూరులో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు హాజరు కావా లని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు ఆ గ్రామ యువశక్తి యూత్ సభ్యులు సోమవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో ఆయనను కలిసి ఈ నెల 14 నుంచి 17 వరకూ నిర్వహించే సంక్రాంతి సంబరాలకు రావాలని కోరారు.

నగదు డిమాండ్‌పై కేసు నమోదు

తుని: స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన ఇద్దరు అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేసి రూ.20 వేలు నగదు ఇవ్వాలని డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇన్‌స్ట్రాగాంలో ఫొటోలు సేకరించిన అజ్ఞాత వ్యక్తి ఈ నెల ఆరు నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.



ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగ్గంపేటలో కేక్ కట్ చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఉత్సాహంగా ప్రజాసంకల్పయాత్ర నాలుగేళ్ల సంబరాలు



శంఖవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



తునిలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరిపారు. అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో అన్నివర్గాల సమస్యలు స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో రాగానే వాటిని పరిష్కరించారన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా హామీల అమలే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ప్రజలు ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, సొసైటీ చైర్మన్ కొండమూరి చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్ర లచ్చబాబు, అడపా వీరబాబు, బైరా శ్రీరామమూర్తి, పడాల బుజ్జి, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

తుని: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం తునిలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామా సెంటర్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో తుని పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నట్టు చైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగా భవానీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, పార్టీ తుని పట్టణ, రూరల్ మండలాధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జెడ్ఆర్‌యుసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపు మేరకు నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బాలాజీ చౌక్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. రికార్డు స్థాయిలో 341 రోజుల పాటు 3648 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసిన ఘనత జగన్‌కే దక్కిందని కొనియడారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం గ్రామాల్లోనూ పార్టీ నాయకులు వేడుకలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, సుంకర రాంబాబు, అలమండ వీరరాఘవస్వామి పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ర్యాలీ

ప్రత్తిపాడు: ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ప్రత్తిపాడులో సోమవారం వైఎస్సార్ సీపీ నేతలు వేడుకలు నిర్వహించారు. తొలుత గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ బెహరా దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నంది జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శేరు కృష్ణ, ఆకుల వీరబాబు, చెలంకూరి రామకృష్ణ, ఇసుకపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు నాంది ప్రజాసంకల్ప యాత్ర అని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా జగ్గంపేటలో వేడుకలు నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, నీలపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని మెరక చామవరం, శృంగవరం, బంగారయ్యపేట, రౌతలపూడి, బలరామపురం, ఎ.మల్లవరం, ములగపూడి, రాజవరం, దిగువశివాడ, గిడజాం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

11, 12 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

తుని రూరల్: హంసవరంలో ఈ నెల 11, 12 తేదీల్లో మండల స్థాయి సాంప్రదాయ సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ సోమవారం తెలిపారు. సంక్రాంతికి కోడి పందాలు, పేకాట, గుండాట వద్దు, సాంప్రదాయ క్రీడలే ముద్దు అనే నినాదంతో హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పురుషులకు వాలీబాల్, క్రికెట్‌తో పాటు మహిళలకు సంక్రాంతి ముగ్గులు, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

సంక్రాంతి నేపథ్యంలో యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైన జూదాలు ఆడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

నేడు ఒంటిమామిడిలో గడపగడపకూ..

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు సోమవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రాచపల్లిలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ నేత రామిశెట్టి చినబాబు తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ లగుడు శ్రీనివాసు
- కోటనందూరులో మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ పనితీరును వివరిస్తున్న డాక్టర్ ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ శ్రీనివాసు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని (జగనన్న గోరుముద్ద) ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తనిఖీ చేయాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయం, వైద్యారోగ్య, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతిపథం, ఉపాధిహామీ, రోడ్లు, భవనాలు, గ్రామీణ నీటిపారుదల, ఐసీడీఎస్ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను చదివి వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చురుగ్గా రబీ సాగు పనులు



ఏలేశ్వరంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా రబీ సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పలు గ్రామాల్లో రైతులు దమ్ములు చేసి వరి నాట్లు వేస్తున్నారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ ఏడాది సుమారు 22 వేల ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేస్తున్నారు. ఏలేశ్వరం మండలంలోని తిరుమాలి, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం,పెద్దనాపల్లి తదితర గ్రామాల్లో బోర్లు, చెరువులపై ఆధారపడిన రైతులు నాట్లు ప్రారంభించారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన దానికంటే ఎక్కువగా కురవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో సాగునీరు అందుబాటులో ఉంది. వరిసాగుకు నీటి కొరత లేకపోవడంతో రైతులు ఉత్సాహంగా రబీలో వరి సాగు చేస్తున్నారు. కూలీల సమస్య లేకుండా వెదజల్లు, డ్రమ్ముసీడర్ పద్ధతుల్లో నాట్లు వేస్తున్నారు. నీటి వసతి లేని గ్రామాల్లో రైతులు అపరాల సాగుపై దృష్టి సారించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు హెచ్చరించారు. స్థానిక సర్కిల్ ఇనస్పెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. యువత కోడి పందాలు, గుండాట, పేకాట జోలికి పోవద్దని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా జూదాలు నిర్వహించినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. యువత సంప్రదాయ క్రీడలతో ఆనందంగా గడపాలని సీఐ కిషోర్‌బాబు కోరారు.

శంఖవరంలో జిల్లాస్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీలు

శంఖవరంలో బస్టాండ్ వద్ద ఉన్న మైదానంలో ఈ నెల 12 నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని ప్రత్తిపాడు సీఐ కె కిషోర్‌బాబు తెలిపారు. శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లా స్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో ప్రో కబడ్డీ తరహాలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసు సిబ్బంది వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రత్తిపాడు ఎస్ఐ కె.సుధాకర్ పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో భూముల రీసర్వే



తుని పట్టణంలో డ్రోన్‌తో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు

తుని: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా పట్టణంలో నిర్వహించే రీసర్వేకు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో డ్రోన్ పనితీరును సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక బృందం పట్టణ పరిధిలోని నివాసగృహాలు, ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాలు తదితర వాటి సమాచారాన్ని డ్రోన్ ద్వారా సేకరిస్తుందని చెప్పారు. ఈ సర్వేతో పట్టణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ప్రవీణ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం తనిఖీ



వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ వీఎస్ఎస్ మూర్తి ఆదేశించారు. మండలంలోని రామయ్యపాలెం వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని సోమవా రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చెత్త నుంచి సంపద తయారీకి అవసరమైన చెత్తతో పాటు గ్రామాల పరిశుభ్రత కోసం గాజు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. వీటిలో వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన వాటిని ఉపయోగించి మిగిలిన వాటిని విక్రయించి సొమ్ములను పంచాయతీ నిధులకు జమ చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచార్యులు, లోవరాజు, మైలవరపు బుజ్జి, తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి వెంకటరత్నం



కోటనందూరు పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న వైద్య సిబ్బంది

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య సేవలు అందించా రు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా అభియాన్(పీఎంఎస్ఎంఏ)లో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. ఇందిరాప్రియదర్శిని 65 మంది గర్భిణు లకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రైసుమిల్లర్ల అసోసియేషన్ ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ లంక ప్రసాద్, కనిగిరి దివాణం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రత్తిపాడు: పేదలకు లయన్స్‌క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్యురాలు వెంకటరత్నం కొనియాడారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, లయన్స్‌క్లబ్ అధ్యక్షకార్యదర్శులు గుడాల వెంకటరత్నం, తాతా సాంబు, డి ఫకీర్‌రాజు, సాకేత్ వర్మ, వైద్యురాలు కె. వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని రాచపల్లి పీహెచ్‌సీ డాక్టర్ పవన్‌కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 120 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ఒమ్మంగి గ్రామ వైఎస్సార్ సీపీ నేత మామిడి నరసింహమూర్తి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాణిక్యం, జువ్వల శ్రీను, చంద్రరావు, సత్యవతి, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు



దిబ్బలపాలెం సువ్వయ్యమ్మపేట వద్ద నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలం



మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో పెరిగిపోయిన తుప్పలు

- వాటికి రూ.లక్షల్లో విలువ
- ఆక్రమణలకు గురవుతున్న వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

ఏలేశ్వరం: పట్టణంలో రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు నిరుపయోగంగా మారాయి. పట్టణంలోని ప్రధాన రహదారులను ఆనుకుని స్థలాలు ఉండడంతో అక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పట్టణంలో సుమారు పదికి పైగా బహిరంగ మరుగుదొడ్లను కూల్చివేశారు. అప్పట్లో వాటిని ప్రధానరహదారులను అనుకుని నిర్మించారు. బహిరంగ మరుగుదొడ్లను కూల్చివేయగా ఆ స్థలాలకు ప్రస్తుతం రూ.లక్షల్లో విలువ ఉంది. ప్రధాన రహదారులు, కూడళ్లల్లో ఉండడంతో వాటి స్థానంలో పార్కులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఏలేశ్వరం గ్రామస్థాయి నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పార్కులు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లు కూల్చివేసి ఖాళీగా ఉన్న స్థలాల్లో పార్కులు లేదా కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన ప్రదేశాల్లో స్థలాలు

ప్రస్తుతం మరుగుదొడ్లు కూల్చివేసిన స్థలాలు ప్రధాన ప్రదేశాల్లో ఉన్నాయి. స్థానిక దిబ్బలపాలెంలోని సువ్వయ్యమ్మపేట, సాయినగర్, పెద్ద వీధి పార్కు సమీపంలోనూ, కప్పల చెరువు, మొక్కరేవుల కాలనీ, మార్కెట్ సమీపం, కోనేటి చెరువు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం తుప్పలు పెరిగిపోగా కొన్ని అక్రమణలకు గురయ్యాయి. మిగిలిన స్థలాలు కూడా అక్రమణలకు గురయ్యే అవకాశం ఉందని, వారి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గతంలోనూ ఆక్రమణలు

గతంలో పట్టణంలో ప్రధాన రహదారులను అనుకుని అనేక అక్రమణలు జరిగాయి. రహదారులను అనుకుని ఎటువంటి అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణాలను కూల్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఈ స్థలాలైన పట్టించుకోకపోతే అక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తాం. ప్రస్తుతం అక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటాం.

– కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ కమిషనర్, నగర పంచాయతీ, ఏలేశ్వరం